సనాతన ధర్మం

ప్రవచనం

బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు శర్మ

ఎమెస్కో

సనాతన ధర్మం

మనం సంకల్పం అని ఒకటి చేస్తుంటాం. ప్రతి రోజూ పూజ చేసేటప్పుడు దేశకాలసంకీర్తనమూ అంటారు. అందులో భరత వర్షే, భరత ఖండే అని చెప్తుంటాం. దేశమూ, కాలమూ ఈ రెండూ ప్రధానంగా దేనికొరకు అంటే ధర్మానుష్ఠానం కొరకు. ధర్మం ఎవరు నిర్వర్తించాలి? ఒక్క మనుష్యునికే ధర్మం. ఆ ధర్మం నిరంతరమూ మారిపోతూ ఉంటుంది. మిగిలిన వాటికన్నిటికీ ఒకటే ధర్మం. తిర్యక్కులకు ప్రత్యేకించి పశువులకూ, పక్షులకూ అన్నిటికీ ఒకటే ధర్మం, పశుధర్మం అంటారు. పశుధర్మ నమో ప్రీతిం అంటాడు దేవీభాగవతంలో వ్యాస భగవానుడు. పశువులకి ధర్మం ఒక్కటే. ఆకలేస్తే తినెయ్యడం, దాహమేస్తే తాగడం, కామం కలిగితే సంభోగించడం, నిద్రవస్తే పడుకోవడం, కోపమొస్తే కుమ్మడం, అంతే వాటి ధర్మం తప్ప వాటికి ఇతరవిధాలైన ధర్మం లేదు.

ఇతరవిధాలైన ధర్మం అన్న మాటను మీరు కొంచెం జాగ్రత్తగా పరిశీలన చెయ్యాలి. ఏ ధర్మాన్ని అనుష్ఠించిన కారణంచేత ఇంక మళ్ళీ శరీరంలోకి రావలసిన అవసరంలేని స్థితిని పొందుతాడో, అటువంటి ధర్మాచరణం చెయ్యవలసిన స్థితి కానీ, అధికారం కానీ, ఇతరప్రాణులకు కల్పించబడలేదు. ధర్మానుష్ఠానమంతా ఎవరి కొరకు అంటే కేవలం మనుష్యుని కొరకు. మనుష్యజాతి అంతా ఎక్కడుంటుందీ అంటే ఒక్క భూలోకంలోనే. భూలోకానికి పైన ఊర్ధ్వలోకాలు. భూలోకానికి కింద అధోలోకాలు. మధ్యలో ఉండేది భూలోకం. మళ్ళీ ఈ భూలోకానికంతటికీ కూడా ధర్మాచరణం కానీ, కర్మాచరణం కానీ, యజ్ఞయాగాది క్రతువులు నిర్వహించడం కానీ, అధికారం ఎక్కడున్నదీ అంటే ఒక్క భరతవర్షే, భరతఖండే, జంబూద్వీపే. వేదం స్పష్టంగా ఆ మాటలు చెప్పింది. ఇక్కడ మాత్రమే కర్మానుష్ఠానం,

ఇక్కడ మాత్రమే యజ్ఞయాగాది క్రతువులు. తప్ప ఇతరమైన ప్రదేశాల యందు భూమండలంలో ఈ క్రతువులు చెయ్యడానికి యోగ్యమైన ప్రదేశాలు లేవు. మీరు నన్నొక మాట అడగవచ్చు. ఈ భూమి అంతా కూడా పరమేశ్వరునిచేత సృష్టించబడినదే కదా అటువంటప్పుడు కొంత భాగంలో మాత్రమే యజ్ఞయాగాది క్రతువులు జరిగి, భూమండలమంతా మనుష్యజాతి ఉన్నప్పటికీ, ఈ అధికారం ఇతరప్రదేశాలలో ఎందుకు కల్పించబడలేదు అని. నేను మీతో ఒక్క మాట మనవి చేస్తాను. కొద్ది కొద్దిగా పరిశీలనం చెయ్యండి.

నాకు చాలా నీరసంగా ఉందనుకోండి. చేతులు లాగేస్తూ, కాళ్ళు లాగేస్తూ చాలా మగతగా ఉంది. ఇప్పుడు ఆ నీరసం తగ్గడానికి నేను కాళ్ళకీ, చేతులకీ అన్నం పులుముకుంటానా? కడుపులోకి అన్నం తీసుకుంటానా? కడుపులోకి అన్నంతింటే శరీరమంతా శక్తి ప్రసరిస్తుంది. మీ ఊరికంతటికీ కావలసిన విద్యుత్తు– ఒక చోట విద్యుత్ గృహం ఉంటుంది ఈ ఊరికి చివరలో, పవర్ హౌస్ అంటుంటారు. అక్కడ నుంచి శక్తి ప్రసారమవుతుంది. అన్నిచోట్లకీ విద్యుత్తు వస్తోంది. అలాగే మనుష్య శరీరంలో కడుపులోకి తీసుకున్న అన్నం పచనమై, జీర్ణమై అందులో నుండి ఉద్భవించిన శక్తి శరీరానికంతటికీ అందుతోందా అందట్లేదా, అలాగే భరతవర్షే, భరతఖండే, జంబూద్వీపే. ఇక్కడ చేసిన కర్మానుష్ఠానం, ఇక్కడ చేసే యజ్ఞయాగాది క్రతువులు, ఇక్కడ చేసే 'ధర్మాచరణాల వల్ల ప్రపంచంలో ఉన్న మనుష్యజాతి అంతా ఉద్ధరించబడుతూ ఉంటుంది. అంత గొప్ప అధికారం ఇవ్వబడిన ప్రాంతం భూమండలంలో ఇదొక్కటే.'

మీరు చూడండి – ప్రత్యేకించి ఫ్లాట్స్‌లో ఉన్నవాళ్ళకి బాగా తెలుస్తుంది. ఇదేనండీ నా ఫ్లాట్ ఏరియా అంటాడు. స్తంభాలు వేసి చదునుగా ఉంటుందంతే. అప్పటికింకా గోడలు పెట్టరు. ఆయనే నిర్ణయించుకుంటాడు. ఇదిగో, ఇక్కడొక పడక గది పెట్టుకుంటాను, ఇక్కడ పూజ గది పెట్టుకుంటాను, ఇక్కడ మరుగుదొడ్డి కట్టుకుంటానంటాడు. అంతకుముందు అదంతా సమతలంగా ఒక్కలాగే ఉంది. కానీ ఆయనే గోడలు పెట్టి ఇక్కడ మరుగుదొడ్డి అన్నాడు, ఇక్కడ పూజ గది అన్నాడు, ఇక్కడ వంట గది అన్నాడు, ఇక్కడ పడక గది అన్నాడు. ఒకసారి కట్టేసిన తరువాత ఇక మరుగుదొడ్డిలో భగవత్సంబంధమైన కార్యక్రమం ఏమైనా

చేస్తామా? చెయ్యం. పడక గదిలో చేస్తామా? చెయ్యం. ఒక్క పూజ గదిలోనే చేస్తాము. అలాగే ప్రపంచానికంతటికీ పూజగది ఏదీ అంటే ఒక్క భరతఖండే అంటే ఇక్కడే. అందుకే ఏది భరతవర్షం అని అడిగారు. హిమాలయ పర్వతాలకి దక్షిణాన, దక్షిణసముద్రానికి ఉత్తరాన ఉన్న భూభాగమేదో అది మాత్రమే. ఇక్కడ కృష్ణ జింకలు తిరిగాయి అన్నారు. కృష్ణ జింకలు ఎక్కడ తిరుగుతాయో, ఏది హిమవత్పర్వతాలకి దక్షిణాన ఉందో, ఏది దక్షిణసముద్రానికి ఉత్తరాన ఉందో, ఆ భూభాగం మాత్రమే ధర్మానుష్ఠానానికీ, యజ్ఞయాగాది క్రతువులకూ యోగ్యమైన భూమి.

యజ్ఞయాగాది క్రతువుల వల్ల ఉపయోగమేమిటని మీరొక మాట అడగచ్చు. యజ్ఞం అగ్నిసంబంధం. యజ్ఞంలో అగ్నిని ఉంచి దాని ద్వారా హవిస్సులు ఇస్తారు. హవిస్సులు తినడానికి దేవతలు వస్తారు. దేవతలు వచ్చి నిలబడే ప్రాంతం, కూర్చునే ప్రాంతం, ఆహారం తీసుకునే ప్రాంతం ఈ భూమండలమే. అందుకే మనుష్యజాతికి ఏ ఇతరమైన ప్రాణులకూ లేని విశేషమైన శక్తి ఒకటి ఉంది. దేవతలుగా ఉన్నారనుకోండి. **క్షీణేపుణ్యే మర్త్యలోకం విశంతి**– కొంతకాలం పుణ్యమైపోయిన తరువాత ఆ దేవతలు మళ్ళీ భూమి మీద పడిపోతారు. భూమి మీద పుట్టిన వ్యక్తి సరైన కర్మానుష్ఠానం చేసి, ధర్మాన్ని పట్టుకుని, ఆచారాన్ని పట్టుకుని ఇక పుట్టవలసిన అవసరం లేకుండా మోక్షాన్ని పొందగలడు, తానే దేవత కాగలడు.

శ్రీరామాయణంలో ఒక **శతక్రతు నివాసేనం నాగరాజస్య మూర్ధ్వనే** అంటారు హనుమ. నూరు యజ్ఞాలు చేసిన వ్యక్తి దేవేంద్రుడై ఐరావతం మీద కూర్చుంటాడు. నూరు యజ్ఞాలు ఎక్కడ చెయ్యాలి? ఇక్కడే యజ్ఞం చెయ్యాలి. అంటే యజ్ఞం చేసి దేవేంద్రుడు కూడా కాగలిగిన అధికారం ఏ దేశంలో పొందవచ్చూ అంటే, దేశమంటే నా ఉద్దేశ్యం ప్రదేశం అని– ఒక్క భరతఖండంలో మాత్రమే అది సంభవం. ఇక్కడే దేవతలొచ్చి అన్నం తింటారు. ఇక్కడే దేవతలు సంతృప్తి చెంది సమస్త మనుష్యజాతికీ, ఇతరప్రాణులకూ కావలసిన అన్నాన్ని కల్పిస్తారు. అంటే వర్షాన్ని కురిపిస్తారు. అంటే ఆ వర్షాన్ని ఆధారం చేసుకుని పంటలు పండి, నీళ్ళు దొరికి శం చతుష్పదే, శం ద్విపదే అంటారు. అంటే కేవలం మనుష్యులే కాదు,

రెండు కాళ్ళున్న మనుష్యుల నుంచి నాలుగు కాళ్ళున్న జంతువుల నుండి అన్నీ సంతోషంగా ఉండడానికి కావలసిన వ్యవస్థ ఎక్కడ ఏర్పాటు చెయ్యబడిందీ అంటే, ఒక్క భరతవర్షమూ, భరతఖండమూ ఇక్కడే. అందుకే ఇక్కడ కర్మానుష్ఠానం చేసినవాడు ఇంద్రుడు కాగలడు, దేవత కాగలడు. ఇక్కడ కర్మానుష్ఠానం చేసి భక్తితో కూడిన కర్మాచరణం చేత ప్రీతి చెందిన భగవంతునిచేత అనుగ్రహించబడిన జ్ఞానం వల్ల, ఇక మళ్ళీ పుట్టవలసిన అవసరం లేకుండా పునరావృత్తిరహిత శాశ్వత శివసాయుజ్యస్థితిని పొందగలడు. కాదు. ఇంత గొప్ప ప్రదేశంలో పుట్టి కర్మాచరణం చెయ్యడానికీ, ఆచారకాండ పాటించడానికీ కావలసిన యోగ్యతను పొంది కూడా ఏ విధమైన కర్మాచరణం చెయ్యకుండా తిర్యక్కుగా వెళ్ళిపోగలడు. తిర్యక్కంటే భూమికి అడ్డంగా పుట్టి అడ్డంగా పెరుగుతుంది. అంటే దాని వెన్నుపాము అడ్డంగా ఉంటుంది. అడ్డంగా ఉండి అడ్డదిడ్డంగా తిరిగే ప్రాణిగా మళ్ళీ కొన్ని కోట్ల జన్మలపాటు **పునరపి జననం, పునరపి మరణం, పునరపి జననీ జఠరేశయనమ్, ఇహ సంసారే, బహు దుస్సారే, కృపయా పారే పాహి మురారే,** అంటారు భజగోవిందంలో. అలా కొన్ని కోట్ల జన్మలపాటు తిర్యక్కుగా వెళ్ళిపోగలడు.

ఇక్కడకు వచ్చినవాడు ఎవడున్నాడో మనుష్యుడుగా పుట్టడం అంత గొప్ప విషయం. ఏ ఇతరప్రాణికీ లేని ప్రత్యేక అధికారం ఒక్క మనుష్యునికి మాత్రమే. ఆ మనుష్యుడు కూడా అన్ని చోట్లా పుట్టినవాళ్ళు యజ్ఞయాగాది క్రతువులు చెయ్యడానికి వీలులేదు. ఆ భూములు యజ్ఞయాగాది క్రతువులు చెయ్యడానికి యోగ్యం కావు. అటువంటి యజ్ఞయాగాది క్రతువులు చెయ్యడం కానీ, ఆచారకాండ పాటించడంకానీ, ధర్మానుష్ఠానం చెయ్యడం కానీ, పరమేశ్వరుణ్ణి చేరుకోవడం కానీ సంభవమవడానికి యోగ్యమైన ప్రదేశం ఒక్క భరతఖండమే. అటువంటి చోట పుట్టినవాడు, తననితాను తీర్చిదిద్దుకోవడానికి, తాను ఎలా బ్రతకాలన్నదాన్ని తెలుసుకుని ఉండడానికి, పరమేశ్వరుడు వేదం రూపంలో మనందరికీ కూడా శిష్టాచారాన్ని అనుగ్రహించాడు. ఎలా బ్రతకాలన్న ధర్మం చెప్పడానికి. ఎవరు చెప్పాలి? నేను చెప్తే ధర్మం కాదు, ఎవరో చెప్తే ధర్మం కాదు. ధర్మాన్ని చెప్పడానికి అధికారమున్నది ఒకే ఒక్కటి వేదం. వేదం ధర్మాన్ని చెప్తుందన్నమాటకి అర్థమేమంటే వేదం పరమేశ్వరప్రోక్తం. భగవంతుని చేత